# చెదిరిన సిందూరం

మైసూరు మహానగరము. ప్రకృతి సోయగాల నిలయము నగరం నడిబొడ్డున అందాల పూలతోట. ఉద్యానవనము. తోట నడుమ పేటలాంటి భవన సముదాయం, నాటి మహారాజుల వైభవ ప్రాభవాలను నేటి తరానికి చూపిస్తున్న పోస్టల్ ట్రయినింగ్ సెంటర్. దేశం నలుమూలల నుండి వచ్చిన తపాలాధికారుల శిక్షణా శిబిరము.

లెక్చరర్ నాగసుధ ఆంగ్లోపన్యాసము పుష్కర గోదావరిలా సాగిపోతోంది. పిల్లగాలి తరగలకు మల్లెపూవురేకుల్లా కదుల్తున్న పెదాలు ఉదాత్తభావానికి ఊతమిస్తున్నాయి.

"అలా... తగిన మూల్యం చెల్లించి మన సేవలనుపయోగించుకునే వినియోగదారులు మనకత్యంత గౌరవనీయులు. వారితో ప్రత్యక్ష సంబంధాలున్న పోస్ట్‌మెన్‌లకు శిక్షణనివ్వబోతున్న మీరు మీ గురుతర బాధ్యతల్ని గుర్తిస్తారని ఆశిస్తున్నాను." అధికారుల శిక్షణా శిబిరములో ముగింపు ఉపన్యాసమది. నేను, నా పక్కన కౌల్‌గారు చెవులప్పగించి వింటున్నాము. బలమైన మరో విషయాసక్తి నా మనసును కౌల్‌గారి వైపు మళ్లిస్తోంది. అతన్తో మాట్లాడి తీరాలంటోంది.

ఐదురోజుల శిక్షణా శిబిరము. మొదటిరోజు పరిచయ కార్యక్రమములో కాశ్మీర్ అపిల్‌లా కన్పించిన కౌల్‌గారు తన పేరు పి.యన్.కౌల్‌గా చెప్పి "జమ్మూ కాశ్మీర్ సర్కిల్ నుండి వచ్చా" నన్నారు. అప్పట్నుంచి అతన్తో మాట్లాడాలనే ఆసక్తి అధికమైంది. అందాల కాశ్మీర్లో ఆకుపచ్చని నుంటలు, కార్గిల్ యుద్ధానంతరం పరిస్థితి తెలుసుకోవాలని ఆరాటం, అదో ఉబలాటం.

అదేరోజు మధ్యాహ్న భోజనాలప్పుడు అతని పక్కన కూచుని మాటల్లోకి దింపాలనుకున్నాను.

అన్ని రాష్ట్రాల నుండి వచ్చినవారికి రుచికరమైన భోజనం, అన్ని హంగులున్న వసతి సమకూర్చడం ట్రయినింగ్ సెంటర్ ఆనవాయితి. ఒక్కో గదిలో నాలుగు రాష్ట్రాలకు చెందిన నలుగురికి వసతి. ఇంగ్లీషు లేదా హిందీలో మాట్లాడి తీరాలి. భావాలు పంచుకుని తీరాలి.

ఆ మధ్యాహ్నం ఆకలి అపురావురు మంటోంది, గదిలో ఫైలు పడేసి భోజనాని కెళ్లబోతున్నాను. వేగంగా వెళ్తున్న వాహనానికి స్పీడు బ్రేకుల్లా ఎదురొచ్చినట్లు "ఏంసార్! ఊటకెల్దామా?" రూమ్మేటు కర్ణాటక మిత్రుడు అప్యాయంగా పలుకరించాడు. కన్నడ 'ఊట' తెలుగులో భోజనమని తెలుసు.

"వారెవ్వా! మీకు తెలుగు వస్తుందా?" ఆబగా అడిగాను.

"ఏదో.... స్వల్ప తెలుగు, బట్ నాట్ పర్‌ఫెక్ట్" నవ్వేశాడు.

ఆరోజే పరిచయమై రూమ్మేటు, కొత్త మిత్రుడు.. దులపరించుకుని వెళ్తే బాగుండదు.

"జరా ఠహరో భాయ్! అపన్ మిల్‌కే చలేంగే" మరో రూమ్మేట్ యూ.పి. మిత్రుడు కలిసి వెళ్దామన్నాడు.

"ఓకే. లెటజ్ గో...." తమిళ మిత్రుడు బయలుదేరాడు.

నలుగురమూ కబుర్లాడుతూ డైనింగ్ హాలు కెళ్లాము. డైనింగ్ హాలు మినీ భారతదేశం లాగుంది. కౌల్‌గారికోసం నా చూపుల పరిధి పెరిగిపోయింది. కాని ఆ కాశ్మీరీ పండితుడు తన రూమ్మేట్స్‌తో కబుర్లు చెప్పుకుంటూ భోంచేస్తున్నాడు.

సాయంత్రం.. వేడి చాయ తాగి వాడిగా బయలుదేరాను నావెంట నా రూమ్మేట్సున్నారు. కౌల్‌గారు తన రూమ్మేట్స్‌తో బయటకొచ్చాడు. పూల తోట మధ్య బాట. బాటలో మా ముందు కౌల్‌గారు సరదాగా చేతులూపుతూ, హుందాగా నడుస్తున్నారు. అతని చిరునవ్వులో మంచుకురిసన తుమ్మిరేకుల మెరుపుంది. పూబాలల చెక్కిళ్లను ముద్దాడి వస్తున్న పిల్లగాలి చల్లగా ఒళ్లు నిమురుతోంది. నాగమల్లి. నందివర్ధనాలు తలలూపుతున్నాయి. ఎర్రగులాబీ ముఖవర్చస్సు, ఉంగరాల జుట్టు, జీన్‌పాంటు ఇన్ షర్టులో కౌల్‌గారి అందాన్ని చూసి తీరాలి.

"అదిగో కౌల్‌జీ, మాట్లాడ్తారా?" కన్నడ మిత్రుడి కళ్ల సైగ.

"అవునవును" నా నడక పరుగులా మారింది. ఒక్క నిమిషంలో అతని పక్కనున్నాను.

"మీరెక్కడి కెళ్లున్నారు?" కౌల్‌గారే పలుకరించారు.

"శ్రీ సచ్చిదానందస్వామి వారి దత్తపీఠా శ్రమానికి.... మీరో?"

"మేము బృందావన్ కెళ్తున్నాం." చలాకీగా జవాబు.

"బృందావన్?... సహజ అందాలను సంతరించుకున్న కాశ్మీరం కంటే బాగుంటుందా?" వారించి నా వెంట నడిపించాలనుకున్నాను. నావైపు అదోలా చూశారు.

"సృష్టి చాలా గొప్పది గదా! బృందావన్ ప్రత్యేకత చూడాలి. మనముండేది ఐదు రోజులు. తిరగగల్గిన నాల్గురోజుల్లో అన్నీ చూడాలి గదా!"

"కరెక్టే! బృందావన్‌ను నేనిప్పటికీ రెండుసార్లు చూశా"నన్నాను.

చెయ్యందుకుని షేక్‌హాండిచ్చి వెళ్ళిపోయాడు.

మర్నాడు రాత్రి.... సుష్టుగా భోంచేసి గది కొస్తున్నాను. పచ్చని లాన్‌లో వెచ్చగా కూచుని చాలా మంది కబుర్లాడుతున్నారు. గుంపులో గోవిందయ్యలా అందులో కౌల్‌గారుండొచ్చుగదా!

"నేనొస్తా మీరు వెళ్లండి" రూమ్మేట్సుతో చెప్పి అటు తిరుగాను. వెతుకులాట ప్రారంభించాను. ఫ్లడ్‌లైట్లవెలుతురులో మెత్తనిగడ్డినేల పట్టుపరుపులాగుంది. మైసూరు మల్లెల సువాసనలు, కొమ్మల, రెమ్మల సయ్యాటలు.. అక్కడే పడుకుంటేబాగుండు నన్పించింది.

"హలో సార్!" కౌల్‌గారి రూమ్మేట్. అస్సామీ చెయ్యూపాడు.

"అక్కడ కౌల్‌గారున్నారా?"

"వారు బాగా అలసిపోయారు. ముందే భోంచేసి వెళ్లి గదిలో నిద్రబోతున్నారు" బెంగాలీ మిత్రుని అప్యాయత.

మూడోరోజు సాయంత్రం కౌల్‌గారు మహారాజా ప్యాలెస్ కెళ్తుంటే మేము చాముండి కొండ కెళ్లాం. నాల్గోరోజు మధ్యాహ్నం భోజనాలవుతున్నాయి. ఆసక్తికి కళ్లెం వెయ్యలేక పోయాను. వాళ్ల రూమ్మేట్స్ కంటే ముందే వెళ్లి కౌల్‌గారి పక్కన కూచున్నాను.

"చెప్పండి సార్ విశేషాలు"చపాతీ ముక్కకు ఆలుటమాటా కూరను నంజుకుంటూ వారే అడిగారు.

రాకరాక వచ్చిన అవకాశాన్ని వదులు కోరాదు. "అంతా బాగుంది గానీ మంచుకొండల మురిపాలను పంచుకుంటున్న మీ జమ్మూకాశ్మీర్' గురించి తెలుసుకోవాలనుంది." అన్నంలో సాంబారు కలుపుకుంటూంటే ఉత్సాహం ఉబికొచ్చింది.

"అంటే... భూలోక స్వర్గమనుకుంటున్న ఆ అందాల కాశ్మీర్ గురించా?" ఎర్రని పెదాలమీద తెల్లని చిరునవ్వు – నీరెండలో మంచుకిరణంలా మెరిసింది.

"కాదు. అక్కడి ప్రజాజీవనం, ప్రత్యేకించి కాశ్మీర్ పండిట్ల గురించి...."" అప్పడం నంజుకున్నాను.

శ్రావణమాసం అకాశంలా అతని మొహంలో రంగులు మారాయి "ఆ సంగతి తీరిగ్గా మాట్లాడుకుందాం. మిగిలిన రోజుల్ని హాపీగా గడుపుదాం" మబ్బులు కమ్మిన చందమామలాగైంది మోము.

ప్చ్! ఎంతో ఆశతో కూచున్నాను. ఆశాభంగం అల్లరిని పక్కకు నెట్టేసి మరో అవకాశం కోసం ఎదిరిచూస్తున్నాను.

"రేపు సాయంత్రానికి ముందే మన ట్రయినింగ్ ముగుస్తుంది. మీరు హైద్రాబాదుకే గదా వెళ్లుంది" వారే అడిగారు. నేను నిరాశపడ్తుంటే అతనికి సరదాగా ఉందేమో!

"అపుడు మీరు ఝామ్మున జమ్మూ కెళ్తున్నారు. గదా!" అతి ప్రయత్నమ్మీదో చిరునవ్వు చిలికించాను.

"సారీ. మీరేమి అనుకోవద్దు" నా ముఖ కవళికల్ని పూర్తిగా చదివాడేమో "నేనూ హైద్రాబాదు బస్‌కే రిజర్వ్ చేయించుకున్నాను. మీ సీటు పక్కనే నా సీటు. ట్రావెలర్స్ ఆఫీసులో తెలిసింది" సరేనా! అన్నట్టుగా చూస్తూ లేచాడు.

ఈయన హైద్రబాదు రావడమేమిటి? నా పీడ వదిలించుకోవాలనుకున్నాడేమో!

"అటు చూస్తున్నారేం సార్? కొంచెం అన్నం వడ్డించాలి?" తెలుగు సర్వర్ ముందున్నాడు. ఉబి కొచ్చిన మాతృభాషానందము.. తేనెలొలికే తెలుగు మాటల ముందు మైసూరుపాక్ గూడా దిగదుడుపే.

"భోజనమైపోయింది సోదరా!" భారంగా లేచాను.

ట్రయినింగ్ క్లాసుల్లో తలపండిన మేధావుల ఉపన్యాసాలు, మాదిరి పాఠాలు.. మేము ఇతరులకు ఎలా శిక్షననివ్వాలో విడమరచి చెప్పాయి.

చివరి రోజు ఉదయం సెషన్స్‌లో ప్రతినిధుల మంతా ప్రసంగించాము. కౌల్‌గారు గూడా ఉల్లాసంగా మాట్లాడారు. మధ్యాహ్నం... చివరి సెషన్ వీడ్కోలు సభగా మారింది.

ఆరడుగులు కలిసి నడిస్తే వారు వీరవుతారన్నారు గదా! ఇరవయ్యైదుగురం వేర్వేరు రాష్ట్రాల నుండి వచ్చి ఐదురోజులు కలిసున్నాం గదా! అదొక కమ్మని అనుభూతి.. ఒకరికొకరం వీడ్కోలు చెప్పుకున్నాం.

అప్పటికే సాయంత్రం నాలుగైంది. నా చూపులు కౌల్‌గారి కోసం వెతుకుతున్నాయి. వెనక నుండి నా భుజమ్మీదో చెయ్యిపడింది. ఉలిక్కిపడ్డాను.

"ఇహ వెళ్దామా హైద్రాబాదకు?" కౌల్ మందహాసం. హమ్మయ్య! తీరిగ్గా... తెల్లవారేదాకా మాట్లాడుకోవచ్చు. కలిసి ప్రయాణం, కలుగు వినోదం. ఐదింటికి బదులుగా అంతర్రాష్ట్ర హైటెక్ బస్సు క్రమశిక్షణను ఉదతాభక్తిగా ఉల్లంఘించి అర గంట ఆలస్యంగా బయలుదేరింది. అంతకుముందే మేఘాల దుప్పట్లు కప్పుకున్న ఆకాశం వర్షారాగమందు కుంది. కిటికీ గ్లాసు తలుపులు మూస్తూ

"ఇప్పుడు అడగండి!" హిందీలో నా తలపుల తలుపులు తెరిచారు కౌల్‌గారు. "హిందీలో అవుతే మనసులోని మాట స్వేచ్ఛగా బయటికొస్తుంది గదా!" మెత్తని సీటు కొరిగారు.

"అవును. హైదరాబాదీలకు హిందీ కరతలామలకమే"

"ఆహా! మీ హిందీ స్పష్టంగా ఉంది. కల్లోల కాశ్మీరం గురించి తెలుసుకోవాలనుంది గదూ!" నావైపు తిరిగిడు.

"అవున్సార్!" నేను అతనివైపు తిరిగాను, "వెండికొండల మధ్య వేడుక చేస్తున్న కాశ్మీరీ ప్రజాజీవనం గురించి చెప్పండి"

"మీకెందుకంత ఆసక్తి?"

"ఎందుకంటే.. కాశ్మీర్ ఆపిల్ తోటలు, సరస్సులు, బోటు షికార్లు, స్కేటింగ్ సుందర దృశ్యాల గురించి పత్రికల్లో చదివాను. ఉగ్రవాదుల ఆగడాలు, చొరబాట్లు...."

"మన దృష్టిలో అవి అక్రమ చొరబాట్లు కాని వాళ్ల దృష్టిలో పవిత్ర కార్యక్రమాలు..." బూట్లు విప్పేశారు. అక్కడేం జరుగుతుందో... వాస్తవ పరిస్థితి బయటి ప్రపంచానికి తెలీదు...." హైటెక్ బస్సు భూతల విమానంలా పరుగెడుతోంది.

"అయితే ఆ ఘోరాలు, నేరాల వార్తల్లో నిజంలేదా?" కళ్లలోకి సూటిగా చూశాను.

"నిజాని కుంది కానీ కొండంత సంఘటనను గోరంత మాత్రమే చూపిస్తున్నారు."

"అం..టే....!" నా భృకుటి ముడిపడింది. "కార్గిల్ యుద్ధం తర్వాత కూడా కాశ్మీర్లోకి తీవ్రవాదుల చొరబాటు ఆగలేదా? మైనారిటీల గుండెమంటలు చల్లారలేదా?"

"హుఁ..." కౌలుగారి నిట్టూర్పు వేదనా స్వరంలా వినబడింది. మరిచిపోదామను కున్న విషయాలను మళ్లీ గుర్తు చేస్తున్నారా? అన్నట్టుగున్నాయా చూపులు.

బయట తుంపర్ల వర్షం ఆకాశమ్మీంచి రాలిపడుతున్న ముత్యాల ముక్కల్లాగుంది. గొంతు సవరించుకుని ప్రారంభించారు.

"శకులు, హుణులు, అలెగ్జాండర్, చంగీజ్‌ఖాన్, నాదిర్షా ఘోరీ, గజినీల నాటినుండి నేటివరకు... మన రత్నగర్భను దోచుకోవాలని, సొంతం చేసుకోవాలని సాగుతున్న దండయాత్రలు చొరబాట్లుగా మారాయి." అతని గొంతులో మాటలకందని గమకం. "మేకపిల్లల లేత మాంసానికి మరిగిన తోడేళ్లలా ఈదేశ సంపదను, సంస్కృతిని దోచుకోవడాని కలవాటు పడిన, విదేశీయుల, విజాతీయుల నిత్య మారణహోమాలు అంత సులువుగా ఆగిపోతాయా?"

"మరి... అక్కడి మైనార్టీ హిందూ కుటుంబాలు"

"పుట్టిన మట్టి వాసనను వదలలేక ఉగ్రవాదుల ఆగడాల కాహుతై పోతూనే ఉన్నాయి. దేశ స్వాతంత్ర్యానంతరం కాశ్మీర్ లోయలో లక్షలాదిగా ఉన్న మైనార్టీ కుటుంబాల సంఖ్య వేలల్లో కొచ్చిందీ. దానిక్కారణం.. భారత జవానులు కంటికి రెప్పలా కాపాడుతున్న సరిహద్దుల్లోంచి, కాపలాలేని రహస్య మార్గాల నుండి చొచ్చుకు వస్తున్న జీహాద్ మతతత్వవాదుల వీరంగమే."

"కాని మీరుంటున్నది జమ్మూ... సేఫ్ ప్లేస్ గదా!"

'అది ఒకనాటి మాట. ఇప్పుడు జమ్మూ ప్రాంతం గూడా అగ్నిగుండమైంది. మైనార్టీల జీవితం నరకప్రాయమైంది. పట్టపగలు చిత్రహింసలు, గృహదహనాలు, లూటీలు భరించలేక ఎన్నో కుటుంబాలు పలాయనం చిత్తగిస్తున్నాయి. సరిహద్దులో తీవ్రవాదుల నడ్డగించిన జవానుల కుటుంబాలు బాంబుదాడుల్లో భస్మమైపోతున్నాయి."

"మరి... మీ కుటుంబమో!?"

"కాశ్మీరంటే భారతమాత నుదుటి సిందూరంగదా! ఆ సిందూరంలోని శ్రీనగర్‌లో మాదొక ఉన్నత కుటుంబం." బస్సులైటు మసక వెలుతురులో కౌల్‌గారి ముఖపర్చస్సు వింత రంగులు పులుముకుంది." నా చిన్నతనంలో మా వీధిలోని హిందూ ముస్లిం కుటుంబాలు కలిసి సహజీవనం సాగించేవి, జీహాద్ భూతం దుర్బోధలు పక్కింటి ముస్లిం మిత్రుల మనసుల్ని విషమయం చేశాయి. ఉద్యోగరీత్యా జమ్మూలో ఉంటున్న నేను దుర్గాపూజ పండక్కు నా భార్యతో సొంతూరు శ్రీనగర్ కొచ్చాడు. ఊరంతా ఉత్సాహంగా పండగ జరుపుకుంటోంది. ఆ రోజు పట్టపగలు మా ఇంటిపక్కనున్న మా పెద్దనాన్నగారింట్లోకి తీవ్రవాదులు నినాదాలతో ప్రవేశించి కుటుంబ సభ్యులనందరినీ వేటాడి కాల్చిపారేశారు. మా కుటుంబం భయం గుప్పిట్లో బందీయై జమ్మూకు చేరుకుంది.

మా పాలిట రక్షణ కవచమనుకున్న జమ్మూ కొద్దికాలంలోనే భక్షణాలయంగా మారింది. నా భార్య తరపు బంధువులు హైద్రాబాదులో ఉన్నారు. అందరము అక్కడికెళ్లి పోదామంది నా భార్య కాని... ఆ ప్రాంతంలో అరాడిన మమకారం మా అమ్మానాన్నల్ని వెనుకంజ వేయించింది. రాను రాను నిత్యజీవితం కతిమీద సాములా తయారైంది.

నా చెల్లికి పెళ్ళి ఖాయమైంది. పెళ్ళిలోగా తిరిగొస్తానని నా భార్య మా బేబీతో సహా పుట్టింటికెళ్ళింది. వైవాహిక జీవితం గురించి కమ్మని కలలుకంటున్న నా చెల్లికి అమ్మనాన్నలు కొత్తనగలు చూపిస్తున్నారు. అప్పుడే నేను ఆఫీసు నుంచి వచ్చి టాయ్‌లెట్లో దూరాను. అంతే... బాంబు మోతలతో మా ఇల్లు దద్దరిల్లింది. అమ్మా. నాన్న, చెల్లి హాహాకారాలు అకాశాన్నంటాయి. టాయ్‌లెట్ తలుపుకొద్దిగా తెరిచి చూశాను. నలుగురు నరరూప రాక్షసులు ఇల్లంతా తిరుగుతున్నారు. ముగ్గరు మిలిటెంట్లు ముగ్గురి గుండెలకు తూపాకులు ఎక్కుపెట్టి రాక్షసంగా కాల్చిపారేశారు. కన్నుమూసి తెరిచేలోగా వాళ్లు రక్తం మరుగులో దొర్లుతున్నారు.

"బాబూ! తప్పించుకో!" అమ్మ కడుపుతీపి హెచ్చరించింది.

"నే వెళ్లిపోతున్నా... నువ్వెళ్ళిపో నాయినా!" నాన్న అర్తనాదము.

నా నరాల్లో ఆవేశం, ఆక్రోశం, ఉక్రోశం గంతు లేస్తున్నాయి. అంతరాళాలను ఛేదిస్తూ పొంగుకొస్తున్న దుఃఖాన్ని అదిమిపెట్టాను. ఘోరకలిని కళ్ళారా చూస్తూ హాహా కారాలు అంగలార్పుల్ని చెవులారా వింటూ నిస్సహాయుడినై పోయాను. ఇనప్పెట్టెను

తుపాకి గుండుతో పేల్చేసి అంతా దోచుకుపోయారు. ఆనాటి నుండి ఏడ్చి ఏడ్చి.. నాకళ్లలోపల నీళ్లు ఇంకిపోయినై. గుండె తడారిపోయింది." గొంతు మూగవోయింది. ఏం మాట్లాడాలో తోచక నా మెదడు కాస్సేపు మొద్దుబారిపోయింది. తపిసిన గుడ్డలా గుండె బరువెక్కింది.

"సారీ మిముల్ని బాగా డిస్టర్బ్ చేశాను గదా!" విచారం వెలిబుచ్చాను.

"ఫరావాలేదు!" గొంతు సవరించు కున్నారాయన.

" ఆ క్షణాన... లోకమమంతా చీకటిగా కన్పించింది. గుండెలు బాదుకుంటూ కన్నవారి శవాలమీద పది ఏడ్చాను. ఏడ్చి ఏడ్చి., మా అత్తగారికంటికి కెలా వెళ్ళానో... నాకే సరిగా తెలీదు. అప్పటికీ మా అత్తామామలు హైదరాబాదుకు తరలి వెళ్ళేందుకు తయారవుతున్నారు. విషయం విని గుండెలు బాదుకున్నారు. నా భార్య బావురుమంది. మేమూ వారి వెంట హైద్రాబాదు కొచ్చాము. అక్కడే ఉండిపోయాము. నేను మాత్రం ఉద్యోగం కోసం జమ్మూ కెళ్ళి వస్తున్నాను. మా మామగారికి బేగంబజారులో బట్టల షాపుంది. నన్ను గూడా వ్యాపారంలోకి దిగుమంటున్నారు. వాలెంటరీ రిటైర్మెంట్ తీసుకుని దిగుతానన్నాను." సీటుకొరిగాడు.

మూడు నిమిషాలు భారంగా గడిచాక "మీరు నాకు తెలుగు నేర్పాలి బ్రదర్!" దీనంగా అడిగాడు.

"తప్పకుండా బ్రదర్!" చేతిలో చెయ్యేశాను.

వీడియో గ్రాఫర్.. వీడియో ఆన్ చేశాడు. "సర్ఫరోజ్" సినిమా ప్రారంభమైంది. నాలోని ఉత్సాహం అందోళనగా మారి మెదడు పొరల్ని తడి చేస్తోంది. బస్సు బెంగుళూరు దాటింది. సినిమా ఆగింది. చిక్కబళ్ళాపూర్‌లో బస్సాగింది-హోటల్ ముందు, ప్రయాణీకులంతా దిగి భోజనాల కుపక్రమించారు.

నాకు అన్నం సయించలేదు. కాశ్మీర్ భవితవ్య మేమిటి? బుర్ర గిర్రుమంటోంది. కష్టాలనెదిరిస్తూ కన్నీళ్లు తాగిన కౌల్‌గారు తృప్తిగా భోంచేస్తున్నారు.

జాగృతి 3-7-2006

